

నేటి వరకు 'లక్ష' గడువు

బీసీ కులవృత్తిదారులకు ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనుంది.

- 8లో



ఇళ్లు దక్కేవరకు ఉద్యమాలు

పేదలకు ఇళ్లు దక్కేవరకు ఉద్యమాలు కొనసాగుతాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం

41° / 28°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపు డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ: డీఈఈ సెట్–2023లో ర్యాంకులు సాధించి డిప్లమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లమా ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని నల్లగొండ డైట్ ప్రిన్సిపాల్ కానుగుల నర్సింహా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైట్ కళాశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం 10గంటల వరకు రావాలని కోరారు. వెరిఫికేషన్‌కు వచ్చేవారు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఇంటర్, ఎస్‌ఎస్‌సీ మెమోలతోపాటు రూ.2లక్షలలోపు ఆదాయం, ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

'నీలగిరి'కి హరిత పురస్కారం



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి ఉత్తమ హరిత అవార్డు లభించింది. గత రెండేళ్లుగా పట్టణ పరిధిలో 5 లక్షల మొక్కలు నాటి గ్రీనరీని 15శాతం నుంచి 23 శాతానికి పెంచినందుకు మున్సిపాలిటిని హరితహారం అవార్డు వరించింది. తెలంగాణ హరితోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో అటవీ, దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కమిషనర్ కేవీ రమణాచారి అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్‌అలీ, టీఎస్ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు ఉన్నారు.

కొరటికల్‌కు హరిత అవార్డు



అవార్డు అందుకుంటున్న కొరటికల్ గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు

మునుగోడు: హరితహారంలో భాగంగా అధిక సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచినందుకు గాను మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామం రాష్ట్రస్థాయిలో ఉత్తమ హరిత అవార్డు కైవసం చేసుకుంది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన హరితోత్సవంలో రాష్ట్ర మంత్రి మహమూద్‌అలీ చేతుల మీదుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామోజు వెంకటేశ్వర్లు ఈ అవార్డు అందుకున్నారు.

తూకం తక్కువగా రేషన్ బియ్యం బస్తాలు

చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు ఈనెలకు సంబంధించి డిపోల నుంచి సరఫరా చేసిన రేషన్ బియ్యం బస్తాలు అతి తక్కువ తూకంతో వచ్చా యి. ఒక్కో బస్తా యాభై కేజీల తూ కం ఉండాల్సింది పోయి కేవలం 35, 42 కేజీల తూకం మాత్రమే ఉన్నాయి. దీంతో ఒక్కో రేషన్ దుకాణానికి సుమారుగా 3 నుంచి 4 క్వింటాళ్ల బియ్యం తరుగుగా వస్తుందని డీలర్లు వాపోతున్నారు. ఫలితంగా తాము డీడీలు కట్టి తెచ్చుకున్న బియ్యం లబ్ధిదారులందరికీ సరిపోవడం లేదంటున్నారు. వెంటనే తరుగు వచ్చిన రేషన్ దుకా ణాలకు అదనంగా బియ్యం సరఫరా చేయాలని ఆయా దుకాణాల డీలర్లు కోరుతున్నారు.

కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు

పెద్దవూర: కృత్రిమ గర్భధారణతో నాణ్యమైన మేలుజాతి దూడలు పుడతాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి పాశం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వెల్మగూడెం, బసిరెడ్డిపల్లి గ్రామాల గోపాలమిత్ర సెంటర్ పరిధిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరాల కొండయ్య, వైస్ ఎంపీపీ గోన వివేకరావు, పశుగణాభివృద్ధి సంస్థ అనుముల క్లస్టర్ సూపర్‌వైజర్ నడ్డి బాలరాజుయాదవ్, గోపాలమిత్రలు శ్రీనాథ్ పాల్గొన్నారు.

ముందస్తు సాగు వెనక్కే!



పెద్దవూర మండలం మల్లెవానికుంట తండాలో స్ప్రింక్లర్ల ద్వారా పత్తి మొక్కలకు పెడుతున్న నీరు

- జూన్ మూడో వారం గడుస్తున్నా పలకరించని తొలకరి
- వర్షాలు లేకపోవడంతో సాగు పనులు ఆలస్యం
- ముందుగా పడిన వర్షానికి పత్తి గింజలు పెట్టిన రైతులు
- ఇప్పుడు మొలకలను కాపాడుకునేందుకు నానా తంటాలు
- కొన్నిచోట్ల స్ప్రింక్లర్ల ద్వారా నీరందిస్తున్న కర్షకులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు రమావత్ లక్‌పతినాయక్. ఇతని పెద్దవూర మండలం మల్లెవానికుంట తండా. గత నెల చివరి వారంలో వచ్చిన వర్షానికి తనకున్న ఎకరన్నరలో పత్తి విత్తనాలు విత్తాడు. అవి మొలకెత్తాయి. వర్షాలు పడకపోవడంతో మొలకెత్తిన మొక్కలు ఎండిపోయే పరిస్థితి ఉంది. వాటిని కాపాడుకునేందుకు సమీప పొలం రైతును బతిమిలాడి నీరడిగాను. పక్క రైతు వద్ద పైపులు, స్ప్రింకర్లు తెచ్చుకొని ఆ బోరు నుంచి నీటి తడులను అందిస్తూ పంటను కాపాడుకుంటున్నాడు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ప్రభుత్వం నిర్ణయించిన ముందస్తు సాగు ఆలస్యం అవుతోంది. వర్షాలు కురవకపోవడంతో పంటల సాగు ఎప్పటిలాగే ముందుకు సాగడం లేదు. ఈ సీజన్‌ను కనీసం నెల రోజుల పాటు ముందుకు జరపాలనుకున్నా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఏటా అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట దెబ్బతింటుండటంతో రైతులు నష్టపోతున్నారు. అలాంటి పరిస్థితుల నుంచి పంటలను కాపాడేందుకు, రైతులు నష్టపోకుండా చూసేందుకు ప్రభుత్వం ఈ వానాకాలం సాగును ముందుకు జరపాలని నిర్ణయించింది. తద్వారా కోతలు తొందరగా పూర్తయి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అకాల వర్షాల బారిన పడకుండా ఉండొచ్చని భావించింది. ప్రభుత్వం ఒకటి తలిస్తే మరొకటి జరిగిందన్నట్టుగా వర్షాలు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరే పరిస్థితి లేకుండా పోయింది.

సాగు సాగట్లే..

గత సంవత్సరం ఈ సమయానికే వర్షాలు కురిశాయి. బోరు బావులు, ఏఎంఆర్‌పీ చెరువుల కింద నార్లు పోసుకున్నారు. నాట్లు కూడా ప్రారంభించారు. మెట్ట ప్రాంతాల్లో పత్తిపటను కూడా 10వేలకు పైగా ఎకరాల్లో సేద్యం చేశారు. అయితే ఈ వానాకాలం సాగు మాత్రం ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. జూన్ మొదటి వారంలో వర్షాలు పడాల్సి ఉన్నా ప్రస్తుతం 3వ వారం గడిచినా నేటికీ జాడలేని పరిస్థితి నెలకొంది. ఇంకా ఎండల తీవ్రత కూడా తగ్గలేదు. రుతుపవనాలు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ వరకే వచ్చి ఆగాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తెలంగాణకు రావడానికి ఇంకా వారం రోజుల పైచిలుకే పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.

కొన్నిచోట్ల మొలకలొచ్చినా..

జిల్లాలో పెద్దవూర, మర్రిగూడ, నాంపల్లి, శాలిగౌరారం, మునుగోడు తదితర మండలాల్లో కొందరు రైతులు అకాల వర్షాలు కొద్దిపాటిగా కురువడంలో రోహిణి కార్తె నుంచే అక్కడక్కడా పత్తి విత్తనాలు నాటడం మొదలు పెట్టారు. దాదాపు మర్రిగూడ మండలంలో 13వేల ఎకరాల్లో పత్తి విత్తనాలు నాటితే 2వేల ఎకరాల్లో కూడా మొలకెత్తలేదు. మొలకెత్తిన వాటిని నీరు అందుబాటులో ఉండటంతో కొందరు రైతులు నీటి తడులను ఇస్తున్నారు. నీరు లేనివారు మళ్లీ దున్ని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దవూర మండలంలో కూడా మొలకెత్తిన పత్తి పంటను దక్కించుకునేందుకు అదనంగా ఖర్చు చేసి, స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందింస్తున్నారు.

నాలుగు ఎకరాల్లో పత్తి మొలకెత్తలే..



మొదట పడిన వర్షానికి నాలుగు ఎకరాల్లో పత్తి నాటాను. 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలు పట్టాయి. చెలకలో తడి లేక మొలకెత్తలేదు. దీంతో చేనంతా కలియ దున్నాను. అచ్చుతోలిన వారికి, విత్తనాలకు, కూలీలకు మొత్తం రూ.20వేలకు పైగా ఖర్చు అయ్యింది.

– లింగయ్య రైతు, వట్టిపల్లి, మర్రిగూడ మండలం

స్ప్రింక్లర్ల ద్వారా నీరు అందిస్తున్నా..

సీజన్ మొదట్లో వచ్చిన వర్షానికి పత్తి విత్తనాలు నాటి రెండు వారాలు అవుతున్నా వర్షాలు పడలేదు. మొలిచిన మొలకలు దుక్కిలోనే మగ్గిపోతాయనే భయంతో స్ప్రింక్లర్లతో మూడు రోజుల నుంచి నీటి తడులను అందిస్తున్నాను.

– కౌలురైతు యాదయ్య, రాంరెడ్డిపల్లి, మర్రిగూడ మండలం

సాగు అంచనా 11.93 లక్షల ఎకరాలు

2023 వానాకాలం సాగు అంచనా 11.93లక్షలుగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. 2022లో 11,54,286 ఎకరాల్లో సాగు చేశారు. దానికి మించి సాగు అంచనా వేశారు. కానీ వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు పెరిగే అవకాశం కనిపించడం లేదు. ఆలస్యంగా నాటినా కూడా పంటలు దిగుబడి రాదని రైతులు భావిస్తున్నారు.

ఈసారీ ఆలస్యమే..

ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఇప్పటికే వరినాట్లు వేయాల్సి ఉంది. మెట్టపంటలు సాగు సగం వరకు విత్తనాలు విత్తే ప్రక్రియ పూర్తి కావాలి. కానీ వర్షాలు ప్రారంభం కాకపోవడంతో సాగు ప్రారంభమే కాలేదు. ఆలస్యంగా సాగు చేయడం వల్ల మళ్లీ పంట కోతకు వచ్చే సమయంలో అకాల వర్షాలకు పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. మరో పక్క మెట్టప్రాంతాల్లో ఆలస్యంగా విత్తనాలు వేయడం వల్ల దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా ప్రభుత్వ ముందస్తు సాగు లక్ష్యం ఏ మేరకు సఫలమవుతుందో వేచి చూడాలి.

ప్రజల సంపదను దోపిడీ చేస్తున్నారు



తాటికల్ మీదుగా సాగుతున్న భట్టి విక్రమార్క పాదయాత్ర

- కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి
- సీఎల్పీ నేత భట్టివిక్రమార్క

నకిరేకల్ : రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిన కేసీఆర్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పాలకులు పందికొక్కుల్లా ప్రజల సంపదను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. భట్టి చేపట్టిన పీపుల్ మార్చ్ పాదయాత్ర నల్లగొండ మండలం చిన్నసూరారం నుంచి నకిరేకల్ మండలంలోని ప్రవేశించింది. నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడెం వద్ద పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, పీసీసీ నేత దైద రవీందర్, నాయకుడు వేదాసు శ్రీధర్ ఆధ్వర్యంలో వేరువేరుగా స్వాగతం పలికారు. ఆర్లగడ్డగూడెం, తాటికల్ మీదుగా నకిరేకల్ వరకు పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా రోడ్డు వెంట మెట్ట భూములలో పనులు చేసుకుంటున్న రైతులను, కూలీలను పలకరించారు. ఆర్లగడ్డగూడెం వద్ద నిరుద్యోగి పందిరి రవీందర్‌రెడ్డి తన బాధను వెళ్లబుచ్చారు. నేను ఎంటెక్ చదివాను గ్రూప్స్ సాధించాలన్న పట్టుదలతో ఎంతో కష్టపడి ప్రిపేర్ అయ్యి పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో పేపర్‌లీక్ కావడంతో ఏమీ చేయలేక ఇంటికి వచ్చి వ్యవసాయ పని చేసుకుంటున్నానని తన ఆవేదన వెళిబుచ్చాడు. తాటికల్ గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న ఉపాధి హామీ కూలీలు కట్ట చంద్రకళ, వనం సైదమ్మ, పూలమ్మ, ఇందిరలు ఉపాధి కూలీలు వారి కష్టాలను చెప్పుకున్నారు. ఉపాధి హామీ పని చేసే ప్రాంతాలలో కనీసం మంచినీళ్ళు, టెంట్లు లేవన్నారు. డబ్బులు కూడా వారం వారం ఇవ్వడం లేదన్నారు. తాటి చెట్లు ఎక్కేందుకు మిషన్‌లు కావాలని, వయస్సు పైబడిన గీత కార్మికులకు పెన్షన్ కావాలని గీతకార్మికులు కోరారు. తాటికల్‌లో కార్నర్ మీటింగ్‌లో భట్టివిక్రమార్క మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కొలువులు రాక నిరుద్యోగులు రోడ్లవెంట తిరుగుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పరిపాలనలో ఇంటికి ఒక్క కొలువు కూడా రాలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే ప్రజలు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ దొరల ప్రభుత్వానికి రాబోయే ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పి ప్రజల ప్రభుత్వమైన కాంగ్రెస్ పాలనను తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదలు ఇళ్లు నిర్మించుకోవడం కోసం రూ.5లక్షలు ఇస్తామని, రేషన్ కార్డు కలిగి ఉన్న లబ్ధిదారులకు రూ.500కు గ్యాస్ సిలిండర్ అందజేస్తామన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు చెనగాని దయాకర్, గాజు ల సుకన్య శ్రీనివాస్, దైద స్వప్న, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, యాస కర్ణాకర్‌రెడ్డి, గుణగంటి రాజు, యానాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడెం వద్ద నిరుద్యోగితో మాట్లాడుతున్న భట్టివిక్రమార్క

ఆకుపచ్చ తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

హాలియా : పర్యావరణ సమతుల్యతను పెంచేందుకు రాష్ట్రంలో కోట్లాది మొక్కలు నాటి ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హాలియా పురపాలిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అలీనగర్‌లో చేపట్టిన హరితోత్సవ కార్యక్రమాన్ని ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. హరితహారంతోనే భవిష్యత్ ఉంటుందని, ప్రతిఒక్కరూ సాధ్యమైనన్ని మొక్కలు నాటి భావితరాలకు మంచి ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సాగర్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, ఎడమకాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, కౌన్సిలర్లు, వర్ర వెంకట్‌రెడ్డి, నల్లబోతు వెంకటయ్య, అన్నెపాక శ్రీనివాస్, ప్రసాద్ నాయక్, కోఆప్షన్ సభ్యులు చాపల సైదులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



హాలియాలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: నల్లగొండ ప్రభుత్వ బీఈడీ కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ అబ్దుల్‌మునాబ్ ఒకప్రకటనలో తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, సోషియాలజీ, ఫిలాసఫీ, ఆరోగ్య, వ్యాయామ విద్య, దృశ్యకళలు కళావిద్య, ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్ ఐసీటీ విభాగాల్లో ఒక్కొక్క పోస్టు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ,ఎంఈడీ కలిగిఉండాలని, దృశ్యకళలో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలని తెలిపారు. ఈ నెల 30లోగా కళాశాలలో దరఖాసు చేసుకోవాలని కోరారు.

ప్రతిఒక్కరూ పది మొక్కలు పెంచాలి

- టీఎస్‌ఎస్పీ బెటాలియన్స్ డీఐజీ సిద్దిఖీ

నల్లగొండ క్రైం: ప్రతిఒక్కరూ పది చొప్పున మొక్కలు నాటి పెంచాలని టీఎస్‌ఎస్పీ బెటాలియన్స్ డీఐజీ ఎంఎస్. సిద్దిఖీ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అన్నెపర్తి బెటాలియన్‌లో నిర్వహించిన హరితోత్సవంలో కమాండెంట్ సాంబయ్య, గ్రామ సర్పంచ్ అరవింద్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. బెటాలియన్‌లో భారీ సంఖ్యలో మొక్కలు పెంచడంతో చిట్టడవిని తలపిస్తుందన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మొక్కలు పెంచుతున్న శౌర్య నర్సరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు వెంకన్న, తిరుపతి, డీఆర్‌డీఓ కాళిందిని, ఏపీఓ శైలజ, యుంగేంధర్‌గౌడ్, సైదులుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బెటాలియన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న డీఐజీ సిద్దిఖీ తదితరులు

నేడు విద్యా దినోత్సవం

- హాజరు కానున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్

నల్లగొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని 478 గ్రామ పంచాయతీల పరిధిలో 1,333 పాఠశాలలను మామిడి తోరణాలు, కొన్ని పాఠశాలలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం గ్రామాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లకార్డులు పట్టి ర్యాలీలు తీస్తూ ఇల్లిళ్లు తిరుగుతారు. అనంతరం ఎస్‌ఎంసీ కమిటీలు, ఉపాధ్యాయులు సమావేశమై విద్యా కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. అయితే నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్‌లో విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డితోపాటు, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలతోపాటు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారు. ఈ సందర్భంగా ఈ ఏడాది విద్యార్థులకు అందించనున్న రాగిజావ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఉపాధ్యాయులకు ట్యాబ్‌లతో పాటు విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, స్కూల్ యూనిఫా మ్ అందిస్తారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించి పరిశీలిస్తారు.

అవార్డులు అందజేయనున్న మంత్రి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 45 మంది ఉత్తమ విద్యార్థులతోపాటు ఉత్తమ సేవలు అందించిన 100 మంది ఉపాధ్యాయులకు మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుంది.



విద్యా దినోత్సవం సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన నల్లగొండ పట్టణంలో గల పద్మానగర్‌లోని పభుత్వ ప్రాథమిక పాఠశాల

డిగ్రీ అడ్మిషన్లు డీలా!

'దోస్త్'కు తగ్గిన ఆదరణ

- ఎంజీయూ పరిధిలో మొత్తం సీట్లు 24,720
- భర్తీ అయినవి 2,905 మాత్రమే..
- 9 ప్రభుత్వ కళాశాలల్లో 6.54 శాతమే సీట్లు భర్తీ



కోదాడ: విద్యార్థులు సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదవడానికి విముఖత చూపుతున్నట్టు తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రకటించిన మొదటి విడత అడ్మిషన్ల వివరాలు చూస్తే ఈ విషయం అవగతమవుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, అటానమస్, ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 11.75 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో కళాశాలల వివరాలు

	కళాశాలలు	సీట్లు	భర్తీ అయినవి	ఖాళీలు
ప్రభుత్వ	09	3,420	210	3,210
ఎయిడెడ్	02	1,260	162	1,098
ప్రైవేట్	58	20,040	1,280	18,760
మొత్తం	69	24,720	2,905	21,815

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఇలా..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, అటానమస్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు 69 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 24,720 సీట్లు అందుబాటులో ఉండగా కేవలం 2,905 మంది మాత్రమే అడ్మిషన్ తీసుకున్నారు. నిండిన సీట్లలో నల్లగొండలోని ఎన్‌జీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో 1,253 సీట్లు భర్తీకాగా మిగిలిన 67 కళాశాలల్లో 1,652 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తం 9 ప్రభుత్వ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో 3,420 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో కేవలం 210 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఇది 6.54 శాతానికి సమానం. ఇక రెండు ఎయిడెడ్ కళాశాలల్లో 1,260 సీట్లు ఉండగా వీటిలో 162 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇది 12.85 శాతానికి సమానం. ఒకప్పుడు సీట్లు దొరకడమే మహాభాగ్యంగా భావించే పలు కళాశాలల్లో పట్టుమని 10 మంది విద్యార్థులు చేరకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 400కు పైగా డిగ్రీ సీట్లు ఉండగా కేవలం ఇక్కడ 40 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. కొన్ని కళాశాలలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి.

'ప్రైవేట్'లోనూ అంతంతే..!

ఉమ్మడి జిల్లాలో 58 ప్రైవేట్ కళాశాలలు ఉండగా వీటిలో 20,040 సీట్లు ఉండగా 1,280 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. అంటే సగటున ఒక్కో కళాశాలలో 22 మంది మాత్రమే చేరారు. కొన్ని గ్రూపుల్లో ఇద్దరు ముగ్గురు మాత్రమే అడ్మిషన్లు తీసుకోవడంతో ఈ గ్రూపులను ఎలా నడపాలో అర్థంకావడం లేదని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. 20 కళాశాలల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాకపోవడంతో వీటి పరిస్థితి అయోమయంలో పడింది.

అటానమస్ కళాశాలలు కాస్త మెరుగు

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న అటానమస్ కళాశాలలు నాగార్జున డిగ్రీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాలల్లో 2,700 సీట్లు ఉండగా 1,253 సీట్లు నిండాయి. ఉమ్మడి జిల్లాలో భర్తీ అయిన సీట్లలో దాదాపు 40 శాతం ఈ రెండు కళాశాలల్లోనే భర్తీ అయ్యాయి. మిర్యాలగూడ, భువనగిరిలో ఉన్న రెండు ఎయిడెడ్ కళాశాలల్లో 1,260 సీట్లు ఉన్నప్పటికీ కేవలం 162 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ఇది 12.85 శాతానికి సమానం. ఈ రెండు కళాశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకంటే అధ్యాపకులు, సిబ్బంది సంఖ్యే ఎక్కువగా ఉండడం గమనార్హం.

10 మంది కంటే తక్కువ చేరితే సెక్షన్ రద్దు..

డిగ్రీ కళాశాలల్లో ఉన్న ప్రతి సెక్షన్‌కు కనీసం 10 మంది విద్యార్థులు చేరితేనే సదరు సెక్షన్‌ను కొనసాగిస్తారు. అంతకంటే తక్కువ మంది విద్యార్థులు చేరితే సెక్షన్ రద్దు చేసి వాటిని పక్క కళాశాలలో చేర్చుతారు. కానీ, ప్రతి కళాశాలలో ఇదే పరిస్థితి ఉండడంతో ఇప్పుడు అధికారులు ఏమి చేస్తారో చూడాలి. ఇక పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో అక్కడ పోస్టులు రద్దయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీంతో అధ్యాపకులకు కూడా స్థాన చలనం తప్పకపోవచ్చు. త్వరలో జరగనున్న రెండు, మూడో విడతల్లో విద్యార్థులను చేర్చుకోవడానికి ప్రైవేట్ కళాశాలలతో పాటు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు కూడా విద్యార్థుల వేటలో పడ్డారు.

ఆదరణ తక్కువగా ఉంది



ఈ విద్యాసంవత్సరం డిగ్రీ అడ్మిషన్లు ఆశాజనకంగా లేవు. విద్యార్థుల నుంచి ఆదరణ తక్కువగా ఉంది. రెండు, మూడు విడతల్లో విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరుతారని ఆశిస్తున్నాం. జిల్లా నుంచి ఎక్కువ మంది హైదరాబాద్‌కు వెళ్తున్నారు. దీంతో జిల్లాలో తక్కువ అడ్మిషన్లు అయ్యాయి.

– డాక్టర్ ఆకుల రవి, దోస్త్ కన్వీనర్, ఎంజీయూ

క్లుప్తంగా

ఎస్‌హెచ్‌ఓగా ట్రైనీ ఐపీఎస్ విధులు నిర్వహణ



పోలీస్‌స్టేషన్‌లో రిపోర్ట్ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్

బొమ్మలరామారం : మూడు నెలల శిక్షణ కాలంలో భాగంగా 2021 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐపీఎస్ అధికారి శివం ఉపాధ్యాయ బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రిపోర్ట్ చేశారు.శిక్షణలో భాగంగా ఐపీఎస్ అధికారి ఎస్‌హెచ్‌ఓగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.శిక్షణ కాలంలో పోలీస్ స్టేషన్‌లో క్షేత్ర స్థాయిలో పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజల ఫిర్యాదులు, తీసుకోవలసిన చట్టపరమైన చర్యలపై శిక్షణ పొందనున్నట్లు తెలిపారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుకు ఉత్తమ అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గోపాల్‌రావు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ హరిత పారిశ్రామిక పార్కుగా ఎంపికైంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన హరితోత్సవంలో అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర అటవీ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) జాయింట్ సెక్రటరీ మిరుపాల గోపాల్‌రావు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఒంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో మహిళకు ఏడాది జైలు

చివ్వెంల(సూర్యాపేట) : చెక్ బౌన్స్ కేసులో మహిళకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కామిశెట్టి సురేష్ సోమవారం తీర్పునిచ్చారు. సూర్యాపేట పట్టణానికి చెందిన మదాసు స్వప్న వద్ద అదే పట్టణానికి చెందిన నామా సైదమ్మ 2015 సంవత్సరంలో రూ.2లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్ ఇచ్చింది. దీంతో స్వప్న కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితురాలికి రూ. 4 లక్షల జరిమానాతో పాటు, ఏడాది జైలు శిక్ష విధించారు. నగదు చెల్లించని యెడల మరో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

కట్టుకున్నోడే కడతేర్చాడు !

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఘాతుకం
- తండ్రి వద్ద తల్లి సెల్‌ఫోన్ ఉండడంతో అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన కూతురు
- పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి.. నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన చౌటుప్పల్ ఏసీపీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మొగిలయ్య

చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఈ నెల 15న చోటు చేసుకున్న మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. అడిగినప్పుడల్లా డబ్బులు ఇవ్వకపోవడంతోనే ఆమె భర్తే దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చౌటుప్పల్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వై.మొగిలయ్య కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలోని మీర్‌ఆలంమండి జగ్జీవన్‌నగర్‌కు చెందిన తోకల నగేష్‌కు తోకల శోభ(39)తో 19ఏళ్ల క్రితం వివాహమయ్యింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండేళ్ల క్రితం లక్కారం గ్రామానికి వచ్చారు. అక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నారు. నగేష్ పాత టైర్ల వ్యాపారం చేస్తుండగా, శోభ లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. చిన్న కుమార్తె హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతుండగా, పెద్దకుమార్తె మీర్‌ఆలంమండిలోని ఇంటి వద్ద ఉంటోంది.

ఆర్థిక సమస్యలు తలెత్తడంతో..

నగేష్‌కు వ్యాపారం సరిగా సాగకపోవడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఖర్చులకు భార్యను డబ్బులు అడిగేవాడు. కానీ అడిగిన ప్రతిసారీ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. అందులో భాగంగా ఈనెల 15న భార్యతో గొడవపెట్టుకున్నాడు. ఆగ్రహంతో ఆమె మెడకు టవల్‌తో బిగించాడు. చేతితో గొంతు పిసికాడు. కాలుతో గొంతు నొక్కి హత్య చేశాడు. అనంతరం మీర్‌ఆలంమండిలోని ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు కుమార్తె ప్రసన్న తల్లి సెల్‌కు ఫోన్‌చేయగా ఇంట్లోనే ఉన్న తన తండ్రి ద్విచక్రవాహనంలో ఫోన్ రింగ్ అయ్యింది. దీంతో అమ్మ ఫోన్ నీ వద్ద ఎందుకు ఉందని తండ్రిని ప్రశ్నించింది. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో అతన్ని అనుమానించింది. ఇదే విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అందులో భాగంగా సోమవారం మీర్‌ఆలంమండిలోని తన ఇంట్లో ఉన్న నగేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో సీఐ ఎస్.దేవేందర్, ఎస్‌ఐ యాదగిరి, సిబ్బంది ఉన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీఐ దేవేందర్‌ను ఏసీపీ అభినందించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విఠల్‌రెడ్డి

మర్రిగూడ : హత్యాయత్నం కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి నాంపల్లి సర్కిల్ సీఐ విఠల్‌రెడ్డి, ఎస్‌ఐ రంగారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి పరిధిలోని చర్లగూడేనికి చెందిన మాదగోని శ్రీను తన భార్యతో అదే గ్రామానికి చెందిన బండా శ్రీను సఖ్యతగా మెలుగుతున్నాడని అనుమానం పెంచుకున్నాడు. దీంతో బండా శ్రీనును హత్య చేయాలని నిర్ణయించుకుని, అందుకు రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్నేహితుడు లపంగి శ్రవణ్ సహకారం కోరాడు.

అదును చూసి కత్తులతో పొడిచి..

బండా శ్రీనును హత్య చేసేందుకు మాదగోని శ్రీను అదునుకోసం వేచి చూశాడు. ఇదే క్రమంలో ఈ నెల 13వ తేదీన మర్రిగూడ మండల కేంద్రంలోని మద్యం దుకాణాల వద్ద బండా శ్రీను ఉండగా తన స్నేహితుడు శ్రవణ్‌తో కలిసి కత్తులతో దాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బండా శ్రీను ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు మాదగోని శ్రీను, లపంగి శ్రవణ్ సోమవారం మర్రిగూడ మండలంలోని సరంపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్నారని సమాచారం అందడంతో వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద హత్యాయత్నానికి ఉపయోగించిన రెండు కత్తులను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దేవరకొండ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ, ఎస్‌ఐ వివరించారు. వారి వెంట పోలీసు సిబ్బంది జానయ్య, రమేష్, సైదులు, వహీద్‌లు ఉన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'జయ' ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో జయ పాఠశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, డైరెక్టర్లు

సూర్యాపేటటౌన్ : ప్రతిష్టాత్మక ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2023 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఎం.వినీల్ కృష్ణ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 687వ ర్యాంకు, వి.ప్రేమ్ సంతోష్ ఆలిండియా 12వ , జి.నిశాంత్ ఆలిండియా 61వ, ఎం.సాయినాథ్ ఆలిండియా 101వ, ఆర్.నవీన్ ఆలిండియా 149వ, ఎస్.రికిత్‌రెడ్డి ఆలిండియా 155వ, ఎల్.యశ్వంత్ ఆలిండియా 221, ఎం.మనస్వి 238, ఎం.లక్ష్మీప్రసన్న 256, ఎం.నవీద్ 796, ఎం.ప్రణీతరెడ్డి 871, భరత్ ఆలిండియా 951వ, ఎ.జీవన్‌కుమార్ ఆలిండియా 975వ ర్యాంకులు సాధి ంచారు. అలాగే నీట్‌లో తేజస్విని 618, కేదారీశ్వర్ 599, ఎస్‌కె.రీషా 582, బి.జాహ్నవి 556 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

డిండి: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందాడు. డిండి మండలం గోనకొల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. డిండి మండల పరిధిలోని గోనకొల్ గ్రామానికి చెందిన రాగం కృష్ణయ్య, లింగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. వీరిలో రెండవ కుమారుడైన రాజు(కిట్టు)(27) స్థానికంగా కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మిగతా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోనే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒంటరిగా ఉంటున్న రాజు ఇంట్లోనే ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించేలోపే మృతిచెందాడు. అయితే, రాజు మరణంపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

సమస్యల పరిష్కారాని కృషి

భువనగిరి : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ కార్యదర్శి సురేంద్రనాథ్ అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అడ్వకేట్ రక్షణ చట్టాలని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు డెత్‌బెన్‌ఫిట్ కింద రూ. 4 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాలన్నారు. జిల్లా కోర్టులో మౌలిక వసతులు కల్పించి లా అకాడమీని ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా విద్యాసాగర్, అధ్యక్షుడిగా కోలి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పార్థసారథి, కోశాధికారిగా వేణుగోపాల్‌రావులను ఎన్నుకున్నారు.

రేషన్ డీలర్‌పై కేసు

గుర్రంపోడు : ప్రజా పంపిణీ బియ్యం పక్కదారి పట్టించిన రేషన డీలర్ 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు. గుర్రంపోడు మండలంలోని చేపూరు రేషన్ డీలర్ యానక లక్ష్మమ్మపై కార్డుదారుల ఫిర్యాదు మేరకు సివిల్ సప్లయి గిర్దావర్ ఎండీ హాబీబ్‌ను పంపించి విచారణ జరిపించామని తెలిపారు. చేపూరు, పల్లిపహాడ్ షాపుల్లో 117 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. దీంతో డీలరుపై 6ఏ కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

యువకుడు, వివాహిత అదృశ్యం

- యువకుడి ఇంటిపై వివాహిత కుటుంబ సభ్యుల దాడి
- పత్తికి నిప్పు.. సామగ్రి ధ్వంసం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వివాహితను కిడ్నాప్ చేశాడని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు ఓ యువకుడి ఇంటిపై దాడి చేశారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్) మండలం ముక్కుడుదేవులపల్లి గ్రామ శివారు గోస్‌తండాకు చెందిన ఓ వివాహిత నాలుగు రోజుల క్రితం అదృశ్యమైంది. అప్పటినుంచే అదే తండాకు చెందిన బానోత్ బద్రు చిన్న కుమారుడు మోహన్ కూడా కనిపించడం లేదు. దీంతో ఆ మహిళను మోహన్ కిడ్నాప్ చేశాడని సదరు వివాహిత కుటుంబ సభ్యులు అభియోగం మోపారు. ఆమె ఎక్కడ ఉందో చెప్పాలంటూ ఆదివారం రాత్రి మోహన్ ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేసి పత్తికి నిప్పుపెట్టి వెళ్లిపోయారు. బాధితుడు భద్రు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బానోతు చంటి, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు.

నర్సాపురంలో..



భరత్ (ఫైల్)

రాజాపేట : ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన రాజాపేట మండలం నర్సాపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపురం గ్రామానికి చెందిన నీల బలరామ్ కుమారుడు భరత్ (22) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో మనస్తాపం చెందిన భరత్ గత ఏప్రిల్ 21న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు భరత్ ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించలేదు.గతంలో కూడా ఎవరికీ చెప్పకుండా వెళ్లిన భరత్ కొద్ది రోజులకు తిరిగి వచ్చాడు. ఈమారు రెండు మాసాలు గడుస్తున్నా ఆచూకీ లేకపోవడంతో బలరామ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నిలిచున్న లారీని ఢీకొట్టిన డీసీఎం

- ఆస్పత్రికి తరలించేలోపే డీసీఎం డ్రైవర్ దుర్మరణం
- అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని భావిస్తున్న పోలీసులు

చిట్యాల: 65వ నంబర్ జాతీయ రహదారి చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డీసీఎం డ్రైవర్ దుర్మరణం చెందాడు. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న డీసీఎం వాహనం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే మరమ్మతుకు గురై రోడ్డుపై నిలిచున్న రోడ్డు రోలర్‌తో ఓపెన్ లోడెడ్ లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వినయ్‌సింగ్ (42) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైతు వేదికలో చోరీ

మాడుగులపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు మాడుగులపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామ రైతు వేదికలో చోరీకి పాల్పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి అందులోని రెండు మైకులు అపహరించారు. సోమవారం ఉదయం ఆవరణను శుభ్రం చేసేందుకు వచ్చిన స్వీపర్ విషయాన్ని గుర్తించి ఏఈఓ లావణ్యకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే ఆమె అక్కడికి చేరుకొని చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సాయిరాం మృతదేహం

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ రైల్వేస్టేషన్ పరిధిలో ఓ యువకుడు సోమవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఎన్‌టీపీసీ రామగుండానికి చెందిన కుమ్మరికుంట సాయిరాం (22) సికింద్రాబాద్‌లోని కవాడిగూడలో వనజా డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లో మూడేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సాయిరాం సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కిలోమీటర్ నంబర్ 252, 27–29 ఎగువ లైన్‌లో వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ట్రాక్‌మెన్‌లు రైల్వే పోలీసులకు సమాచారం అందజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా సాయిరాంగా గుర్తించారు. సాయిరాంకు ఇంకా వివా హం కాలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించామని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'హరిత తెలంగాణ' సాధనకు కృషిచేయాలి

- అభివృద్ధిలో ముందు వరుసలో రాష్ట్రం
- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



తిర్మాలపూర్‌లో మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్

తుర్కపల్లి : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి హరిత తెలంగాణ సాధనకు కృషి చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ దశాబ్ది వారోత్సవాల సందర్భంగా శుక్రవారం తుర్కపల్లి మండలంలోని తిర్మాలపూర్ గ్రామంలో నిర్వహించిన హరిత దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ముందువరుసలో నిలిచిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని హామీలను అమలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఒకటి చొప్పున మొక్క నాటి సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ నాయక్‌కు ప్రశాంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ బీకునాయక్, సర్పంచ్ నాంసాని సత్యనారాయణ, డీపీఓ సునంధ, మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, ఎంపీడీఓ నూనె ఉమాదేవి, వైస్ ఎంపీపీ మహాదేవుని శ్రీనివాస్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న 'లక్ష' గడువు

- రూ.లక్ష ఆర్థికసాయానికి ఇప్పటికే 27వేల దరఖాస్తులు
- తహసీల్దార్ ఆఫీసుల్లో అందని సర్టిఫికెట్లు
- బీసీ కులవృత్తిదారులకు తప్పని పడిగాపులు
- గడువు పెంచాలని ప్రభుత్వానికి వేడుకోలు



నల్లగొండ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

నల్లగొండ: ప్రభుత్వం 15 బీసీ కుల వృత్తిదారులకు ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయానికి దరఖాస్తుల గడువు మంగళవారంతో ముగియనుంది. అయితే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడకు ఒకేసారి వందలాది మంది రావడం, ఇదే సమయంలో పైచదువుల కోసం వెళ్లే విద్యార్థులు కూడా తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం వస్తుండటంతో సర్వర్లు బిజీ అవుతున్నాయి. దీంతో సర్టిఫికెట్ల జారీలో రోజుల తరబడి జాప్యం జరుగుతోందని దరఖాస్తుదారులు అంటున్నారు.

ఒక్కరోజే గడువు ఉండడంతో..

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవలో దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పది రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా సర్వర్ల సతాయింపుతో నేటికీ కొన్ని చోట్ల సర్టిఫికెట్లు అందని పరిస్థితి నెలకొందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. దీంతో దరఖాస్తుదారులంతా తహసీల్దార్ కార్యాలయాల వద్ద పొద్దస్తమానం ఎండను సైతం లెక్క చేయకుండా పడిగాపులు గాస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. రూ.లక్ష ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు మంగళవారం ఒక్కరోజే ఉండడంతో ఆయా సర్టిఫికెట్లు అందని బీసీ కులవృత్తిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని గమనించి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తు గడువు పెంచాలని బీసీ కులవృత్తిదారులు కోరుతున్నారు.

నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు 27వేల దరఖాస్తులు

రూ.లక్ష ఆర్థికసాయం కోసం బీసీ కులవృత్తిదారులు నల్లగొండ జిల్లావ్యాప్తంగా సోమవారం వరకు 27వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇంకా పెద్ద ఎత్తున చేసుకుంటూనే ఉన్నారు. గడువు ఒక్కరోజు మాత్రమే ఉండడంతో పెద్ద ఎత్తున మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో ఇటు తహసీల్దార్ కార్యాలయాలు.. అటు మీసేవ కేంద్రాల వద్ద దరఖాస్తుదారులతో రద్దీ నెలకొంది.

గడువు పెంచాలి



"రూ.లక్ష ఆర్థికసాయానికి దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం మరికొంత గడువు పెంచాలి. కుల, ఆదాయ సర్టిఫికెట్లు కూడా తహసీల్దార్ కార్యాలయాల్లో వెంటనే ఇవ్వకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

– గంజి మురళి, చేనేత సంఘం నాయకుడు

ఇప్పటివరకు 27వేల దరఖాస్తులు

"రూ.లక్ష ఆర్థిక సాయానికి సోమవారం వరకు 27వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం చివరి తేదీలోగా మరో 10వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. గడువు పెంపుపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.

–ఖాజానజీమ్ అలీ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, నల్లగొండ

ఆటోను ఢీకొట్టిన డీసీఎం.. పలువురికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితులు

భువనగిరి : ఆటోను డీసీఎం ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. భువనగిరి పట్టణ శివారులో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి జగదేవ్‌పూర్ చౌరస్తా నుంచి సుమారు 11మందిని కూలీలను తీసుకుని ఆటోలో యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామానికి ఉదయం వెళ్తున్నారు. పట్టణ శివారులోని మాసుకుంట వద్ద పక్క నుంచి వెళ్తున్న డీసీఎం వాహనం ఆటోను ఢీకొట్టడంతో బోల్తాకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. వారిని పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రానికి చెందిన అన్‌కుస్, జుబేర్ అలీతో పాటు తుర్కపల్లి మండలం పెద్ద తండాకు చెందిన మాలోత్ విజయ, మౌనిక, జ్యోతి, బాబ్లితో పాటు మరికొందరు ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీలో బెల్లం, పటిక పట్టివేత



పట్టుబడిన బెల్లం, పటిక, కారుతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది తదితరులు

హుజూర్‌నగర్ : ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో 250 కేజీల బెల్లం, 5 కేజీల పటిక, 3 లీటర్ల సారాయి రవాణా చేస్తున్న కారు పట్టుబడింది. దానిలో ఉన్న నిందితులు పారిపోయారు. ఈసంఘటన హుజూర్‌నగర్ పట్టణ శివారులో చోటుచేసుకుంది. సోమవారం ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హుజూర్‌నగర్ శివారులో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా వాహనాలు తనఖీ చేస్తుండగా విజయవాడ నుంచి మఠంపల్లి మండలం కొత్తతండాకు బెల్లం, పటిక తరలిస్తున్న టాటా ఇండిగో కారును ఆపబోయారు. దీంతో ఆ కారుతో ఎక్సైజ్ అధికారుల వాహనాన్ని ఢీకొట్టి అందులోని వ్యక్తులు పారిపోయారు. వాహనాన్ని తనిఖీ చేసి అందులో బెల్లం, పటిక, సారాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కొత్తతండాకు చెందిన ధరావత్ రాజ, మాళోతు లచ్చీరాం, మాళోతు నర్సింహగా గుర్తించినట్లు సీఐ తెలిపారు.వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, సిబ్బంది శేఖర్, నాగరాజు, రవి, రమేష్, ధనుంజయ పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

మఠంపల్లిలో సారా విక్రయిస్తున్న నార్ల శ్రీను, బాణోతు దేవ్లా ఇండ్లపై దాడి చేసి ఐదు లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. గరిడేపల్లి మండలంలోని పలు తండాలకు చెందిన 6గురు సారా విక్రేతలను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు.

నిప్పంటుకొని తోటలు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నూతనకల్ : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన నూతన్‌కల్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. నూతన్‌కల్‌లో రోడ్డు వెంబడి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు వేయడంతో గ్రామానికి చెందిన కళ్లెం వెంకట్‌రెడ్డి, ఉప్పుల సత్యనారాయణల మామిడితోటలతో పాటు కళ్లెం వెంకట్‌రెడ్డి, కళ్లెం శంబారెడ్డిల జామాయిల్ తోటలకు మంటలు అంటుకుని దగ్ధమయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది శ్రీధర్, చాంప్లా పాల్గొన్నారు.